
# ఒప్పు + నెప్పు - మార్పు

-అల్లాడ స్నేహలత



కాలింగ్ బెల్ మోగగానే తలుపు తీస్తూనే భర్తమీద విరుచుకుపడింది మాధవి.

"అయ్యాయా మీ తిరుగుళ్లు? అర్ధరాత్రి అయినా భార్య ఒకతి ఒంటరిగా ఇంట్లో పడి ఏడుస్తుందన్న ఆలోచన ఉందా మీకు? క్లబ్బులు, ఫ్రెండ్సూ, పేకాట వగైరా వగైరా సరదాలేగానీ..." భార్య ఏకధాటిన బాణాలు సంధించినట్లు మాటలు విసురుతుంటే ఆశ్చర్యమూ, కోపమూ కూడా కలిగాయి ఫణిభూషణ్‌కి.

"పదిగంటలకే అర్ధరాత్రి అయిందా? ఏమిటీ ఈవేళ కొత్తగా వగైరా...వగైరా అంటున్నావు? ఆ వగైరా అంటే తాగి వస్తున్నాననా?"

"రోజూ కాకపోయినా అప్పుడప్పుడు సేవిస్తూనే వున్నారుగా ఫ్రెండ్స్ బలవంతం చేసారనో, ఏదో ఒక వంక చెప్పి."

"ఈవేళ ఏమయింది నీకు? పిచ్చి ఎక్కిందా? పొగరెక్కిందా?"

"రెండూ ఎక్కాయి. ఇన్నాళ్లూ సహించినందుకు మంచిదాన్ని. ఈవేళ ఎదిరించి ఉన్న మాటలు అన్నందుకు పొగరుబోతుదాన్నా? నా ఇష్టమొచ్చినట్లు, మీకు నచ్చిన విధంగా ప్రవరిస్తే మీరూరుకుంటారా?"

"ఏమిటే లా పాయింట్లు లాగుతున్నావు? ఆడదానికీ మగవాడికీ తేడాలేదా?"

"ఎందుకు లేదు? ఆడది అణిగిమణిగి ఉండడం, మగవాడు ఆధిక్యత వెలగబెట్టడం. అదేగా తేడా? అందుకే మగమహారాజు అన్నారు. ఆడ మహారాణి అనలేదుగా"

"నోర్మూయ్ వెధవ వాగుడూ నువ్వు?"

"మూస్తాను. నా నోరు మూయించకపోతే మీ ఆధిక్యత దిగజారిపోదూ పాపం. ఉన్నమాటంటే ఉలుకెక్కువని... పదండి భోజనం వడ్డిస్తాను" అంటూ విసవిసా వంటింట్లోకి నడిచింది మాధవి ఇంకా మాటలు పెంచకుండా.

"హూ..." అంటూ ఒక్క నిట్టూర్పు వదిలి ఫ్రెష్ అయి వచ్చి డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు ఫణిభూషణ్. మాధవి మౌనంగా వడ్డిస్తుంటే అతనూ మౌనంగానే భోజనం కానిచ్చి ముందు హాల్లోకి వచ్చి పేపర్ తిరగేస్తూ కూర్చున్నాడు. మనసు పోలేదు పేపర్ చదవడానికి.

మాధవి ఎందుకిలా ప్రవర్తించిందీవేళ? ఎంతో నమ్రతగా ఉండే మాధవి ఇలా ఎదిరించి మాట్లాడటమేమిటి? శాంతస్వభావురాలైన మాధవికి ఇంతగా కోపం రావడమేమిటి? మూడు సంవత్సరాల వైవాహిక జీవితంలో ఎన్నడూ కోపం తెచ్చుకోలేదు. తనకీ కోపం తెప్పించలేదు. అతని ఆలోచనలకేమీ మాధవి కోపానికి కారణం అందలేదు. నిద్ర ముంచుకొస్తుంటే బెడ్రూంలోకి వెళ్లాడు. మాధవి మంచానికి ఆ చివరగా ముడుచుకుని పడుకుంది."ఓహో... కోపానికి సూచన కాబోలు ఆ ఫోజు" అనుకుని తనూ ఈ చివరగా పడుకున్నాడు. గాఢ నిద్రలో ఉండగా "అమ్మో రక్తం..." అంటూ మాధవి కలవరిస్తూ మూలుగుతోంది.

మాధవికి ఎప్పుడైనా పీడకల వచ్చి కలవరిస్తే లేపి మంచినీళ్లు తాగించడం అతనికి అలవాటు. నెమ్మదిగా మాధవి ఒంటిమీద చేయి వేసి లేపాలని చూసాడు. వళ్లు కాలిపోతోంది. చాలా జ్వరం వున్నట్టుంది. మంచి నిద్రలో ఉంది. డిస్టర్బ్ చేయకూడదనుకున్నాడు. అమితమైన జాలి కలిగింది ఆ క్షణంలో. ఆ డిమ్‌లైట్‌లో చెదరిన ముంగురులు ఫ్యాన్ గాలికి నుదుటిమీద నృత్యం చేస్తుంటే అమాయకమైన ఆ ముద్దుమోముని ముద్దాడాలనిపించింది. మళ్లీ వద్దులే డిస్టర్బ్ చేసినట్లు అవుతుందని అనుకున్నాడు ఫణిభూషణ్. నిద్ర ఎగిరిపోయింది. ఆలోచనలు చుట్టుముట్టాయి. ఒకనాటి సంఘటన గుర్తుకువచ్చింది.

"మధూ! నామీద నీకు ఎప్పుడూ కోపం రాదా?" అడిగాడు ఒకసారి.

"కోపం ఎందుకు?" ఎదురు ప్రశ్నించింది మాధవి.

"చీటికీమాటికీ నీమీద విసుగు తెచ్చుకుంటున్నానుకదా?"

"ఓ అదా... భార్యాభర్తల్లో ఎవరికి కోపమొచ్చినా ఇంకొకరు శాంతం వహిస్తే ఏ గొడవలూ రావు. ఇద్దరూ కోపం తెచ్చుకుంటే అది వాదులాటకీ, దెబ్బలాటలకీ కారణమవుతుంది. కలతలు రేగి సంసారం కల్లోలమవుతుంది. ఎవరో ఒకరు సర్దుకుపోయి సామరస్యం పాటిస్తే అది సుఖసంసారం అవుతుంది" అంది మాధవి.

"అబ్బా... ఎంత గొప్ప వివరణ ఇచ్చావ్?" అన్నాడు ఫణిభూషణ్.

"అవునండీ... మీరు నాకు తృప్తి కలిగేటంత ప్రేమని అందిస్తున్నారు. అంత ప్రేమని పొందుతున్నప్పుడు అప్పుడప్పుడూ మీ కోపాన్ని కూడా ఓర్పుతో భరించే నేర్పు ఉండాలికదా అని నా ఆలోచన. అలా అయితేనే కలతలూ, కలహాలు రాకుండా సంసారం మధురగీతికలా హాయిగా సాగిపోతుంది. సుఖదుఃఖాలని సమదృష్టితో చూడాలట. అదే స్థితప్రజ్ఞత"

"అబ్బా... వేదాంత విజ్ఞానం బాగా వంటబట్టించుకున్నట్టున్నావు?"

"అవునేమో... మా పిన్ని ఇచ్చిన పురాణ పుస్తకాలు చదవడంవల్ల వంటబట్టిందేమో ఆ వేదాంత విజ్ఞానం" అంది మాధవి.

"అయితే చనిపోయిన మీ పిన్నికి కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిందే" నవ్వాడు ఫణిభూషణ్. అతని మాటలకు మాధవి కూడా నవ్వింది.

అలాంటి మధు ఈవేళ... ఎందుకిలా...ఏమో? కొందరు ఆడవాళ్లు కోపం వస్తే దబ్‌దబ్‌మని పెద్ద శబ్దాల చేస్తూ వస్తువులమీద కోపాన్ని ప్రయోగిస్తారుట. తన క్లోజ్ ఫ్రెండ్ వేణు భార్యకి ముక్కుమీద వుంటుందిట కోపం. ప్రతి చిన్న విషయానికీ కోపం తెచ్చుకుంటుందిట.

"నువ్వు అదృష్టవంతుడివిరా ఫణీ... నా భార్యకు కోపం జాస్తి. ఆఫీస్‌కి వెళ్తూ 'వెళ్తున్నాను తలుపేసుకో' అంటే 'ఆ...దయచేయండి. వేసుకుంటానులే. ఈలోగా ఏ దొంగో వచ్చి మీరు చేయించిన ఏడువారాల నగలూ ఎత్తుకుపోడులే' అని చురక అంటిస్తుంది. ఆఫీసు నుంచి వచ్చి తలుపు తడితే 'ఎందుకా బాదుడు? వచ్చేదాకా ఆగలేరా?' అని రుసరుసలాడుతుంది. ఏ ఒక్కరోజూ సంతోషంగా సాగనంపదు. సంతోషంగా తలుపు తీయదు" అని చెప్పాడు ఒకసారి.

మధు అలా కాదు. తను ఆఫీస్‌కి వెళ్తుంటే ఎంత పనిలో వున్నా వచ్చి చిరునవ్వుతో సాగనంపుతుంది. ఆఫీసు నుండి వస్తే చిరునవ్వుతో స్వాగతమిస్తుంది. అడక్కుండానే మంచినీళ్లు తెచ్చి అందిస్తుంది. మధు ఎంత మంచిదో! అమాంతం భార్యను ముద్దులతో ముంచెత్తాలన్న ప్రేమ పొంగుకొచ్చింది అతనికి. డీప్‌స్లీప్‌లో వుంది. ఇప్పుడు కాదులే అనుకుని ముద్దుల ప్రోగ్రామ్‌ని వాయిదా వేసుకుని మళ్లీ నిద్రలోకి జారుకున్నాడు.

★★★

కాలింగ్‌బెల్ మ్రోగితే మెలకువ వచ్చి లేచి వెళ్లి తలుపు తీసాడు. పనిమనిషి లక్ష్మి పాలపాకెట్‌తో వచ్చింది లోపలికి.


"అమ్మగారు లేవలేదాండీ...పిచ్చితల్లి ఎంత పెరికిదో..జడుసుకుని జ్వరం కూడా తెచ్చుకుంది" అంటూ పనిలోకి దిగింది.

"ఏమిటీ లక్ష్మి నువ్వంటున్నది?" అర్థంకాక అడిగాడు ఫణిభూషణ్.



## వెరైటీ ఛార్మి

'మంత్ర' సినిమా తర్వాత ఛార్మికి చెప్పుకోదగిన హిట్ లేదు. తాజాగా '16డేస్' కూడా పరాజయాన్ని చవిచూసింది. అయితే రాబోయే 'కావ్యాస్ డైరీ' మాత్రం ఆమెకి మార్కులు సంపాదించిపెడుతుందని అంటున్నారు. ఎలాగంటే ఇందులో ఛార్మి నెగటివ్ షేడ్స్ వున్న పాత్ర పోషిస్తోందిట. అంటే విలన్ టైప్ కారెక్టర్. ఇంతకాలం గ్లామరస్ స్టార్‌గా పాజిటివ్‌గా కనిపిస్తూ వచ్చిన ఛార్మి ఇలా విలన్ టైప్ పాత్ర వేయడం వెరైటీయేకావచ్చు. మరి జనాలే ఎంతవరకూ రిసీవ్ చేసుకుంటారో!



"అమ్మగారు మీకు చెప్పలేదా? నిన్న ఒక బాగోతం జరిగిందిలెండి. నిన్న సాయంకాలం అమ్మగారూ, నేనూ మొక్కలకి నీళ్లు పోయడానికి డాబామీదకెళ్లామండి. ఉన్నట్టుండి పెద్ద కేలు వినపడ్డాయండి. ఏంటా అని చూస్తే ఎనకాల గుడిసెల్లోవారు ఎందుకో తిట్టుకుంటూ ఆఖరికి కొట్టుకున్నారు కూడానండి. ఒకడికి తల పగిలి రక్తం కారిందండి. ఆ రక్తం చూసి అమ్మగారికి కళ్లు తిరిగినంత పనయింది. నెమ్మదిగా చేయి పట్టుకుని అమ్మగారిని కిందకు తీసుకువచ్చానండి. తరువాత చెప్పారు అమ్మగారికి రక్తం సూత్తే భయమంటగదండీ. బాగా జడుసుకున్నారు. 'లక్ష్మీ! అయ్యగారు వచ్చేవరకు ఉండవే' అన్నారండి. మీరెంతసేపటికీ రాకపోతే 'ఇంటికెళ్లి అన్నం వండి అరగంటలో వస్తానని' చెప్పి ఇంటికెళ్లానండి. ఈలోగా మా సచ్చినోడొచ్చి ఆడికిష్టమైన కూరొండలేదని నాతో గొడవ పడ్డాడండి. ఆ బాగోతంతో సరిపోయి రాలేకపోయానండి" జరిగిందంతా చెప్పింది లక్ష్మి.

ఫణిభూషణ్‌కి అంతా అర్థమయింది. నిజమే మాధవికి రక్తం చూస్తే చచ్చేంత భయం. ఒకసారి తను యాపిల్ కోస్తుంటే వేలు తెగింది. నాలు గైదు నెత్తురు చుక్కలకే మాధవి 'అమ్మో రక్తం' అంటూ కళ్లు మూసుకుంది. నిన్న ఆ భయంతోనే కోపమొచ్చి ఉంటుంది. తను అనునయంగా 'ఎందుకంత కోపం?' అని అడిగి ఉంటే చెప్పేదే. మాధవి కోపంగా మాట్లాడేటప్పటికి తనకి కోపమొచ్చి తనూ దురుసుగా మాట్లాడాడు. ఈ ఇగో ప్రతి మగాడికి ఉంటుందేమో? లక్ష్మి మొగుడికి అదే వుండి ఉంటుంది. లక్ష్మికి చదువు సంధ్యలులేవు కనుక మగ సచ్చినోడు అని మోటుగా అంది. మాధవికి చదువుసంస్కారం ఉన్నాయి కనుక మగమహారాజు అని అంది. అంతే తేడా!

లక్ష్మి పని పూర్తిచేసుకుని వెళ్తూ 'అయ్యగారూ! నేవెళ్తున్నానండి. అమ్మగారు రాత్రి భోజనం చేయలేదేటండీ. అన్నం,కూర...అన్నీ అలాగే ఉన్నాయి" అనేసి వెళ్లిపోయింది.

అప్పటికి అతనికి స్ఫురించలేదు మాధవి తిన్నదో లేదో కూడా తను ఆలోచించలేదని. ఎంత ఆలస్యమైనా తను వచ్చాక మాధవి తనతోపాటే తింటుంది. అది తెలిసి కూడా తను తిన్నావా అనిగానీ నువ్వు వడ్డించుకోలేదేంటి అనిగానీ అడగలేదు అనుకుని పశ్చాత్తాపపడ్డాడు ఫణిభూషణ్.

మాధవి లేచినట్టుంది. బాత్రూంలో నీళ్ల శబ్దమవుతోంది. బెడ్రూంలోకి వెళ్లి చూస్తే మాధవి టవల్‌తో ముఖం తుడుచుకుంటూ కనిపించింది. గబుక్కున డ్రెస్సింగ్ టేబుల్‌మీదున్న కుంకుమ భరిణను తీసుకుని మాధవి దగ్గరకు వెళ్లాడు. మాధవి ఆశ్చర్యపోతూ మౌనంగా అందుకోబోయింది. మాధవి చేతికివ్వకుండా తనే మాధవి చుబుకాన్ని ఎడమచేత్తో పట్టుకుని చక్కగా, గుండ్రంగా కుంకుమ దిద్దాడు. 'ఎక్స్‌లెంట్' అని నుదుటిపై ముద్దాడాడు. అతని చర్యకి మాధవికి అయోమయంగా ఉంది. లేవబోయింది.

"వద్దులేవకు. జ్వరం తగ్గిందా?"అని ప్రేమగా.

"నాకు బాగానే ఉంది. కాఫీ కలిపి తీసుకువస్తాను" అని లేవబోతుంటే-

"వద్దన్నానా" అని కిచెన్‌లోకి వెళ్లి రెండు కప్పులు కాఫీ కలిపి తెచ్చాడు.

"తీసుకో. రాత్రి కూడా భోజనం చేయలేదుకదా. నేను అడగనైనా అడగలేదు. చాలా ఫూలిష్‌గా ప్రవర్తించాను. సారీ మధూ" అన్నాడు.

"నేనే సారీ చెప్పాలి మీకు. చాలా అసభ్యంగా నోటికొచ్చినట్లు మాట్లాడాను. అసలేం జరిగిందంటే..."

"నాకంతా తెలుసు మధూ. లక్ష్మి చెప్పింది. జడుసుకుని జ్వరం తెచ్చుకున్నావని కూడా చెప్పింది. నువ్వేం ఫీలవకు" ఓదార్పుగా అన్నాడు.

"సాయంత్రం త్వరగా వచ్చేస్తాను. సినిమాకి వెళ్లి అటునుండి హోటల్‌కి వెళ్లి డిన్నర్ చేసి వద్దాం. సరేనా? ఇంక ప్రతిరోజూ ఆఫీస్ అవగానే ఇంటికి వచ్చేస్తాను. ఈ దేవిగారితోనే నా ఎంజాయ్‌మెంట్ అంతా" విస్మయంగా చూసింది మాధవి.

"ఏమిటి మా ఆయన ఇంత మంచిగా మారిపోయాడనుకుంటున్నావా అంత ఆశ్చర్యంగా చూస్తున్నావు?"

"మీరు చెడ్డవారుకాదుగా మంచిగా మారిపోవడానికి"

"దుర్మార్గుడికన్నా బెటర్ కదూ?" నవ్వుతూ అన్నాడు ఫణిభూషణ్.

"చాల్లెండి మీ మాటలు. అయినా మంచిగా మారతానన్నారుగా. సంపూర్ణ సత్పురుషులేలెండి మీరికనుండి" తనూ నవ్వేస్తూ అంది మాధవి.

"ఆ క్రెడిట్ అంతా నీదేకదా" మాధవిని దగ్గరకు తీసుకుంటూఅన్నాడు.


"నాదా?"

"యస్ నీదే" నువ్వే కదా నాలోని మంచి మార్పుకి కారణం"

"నేనా?"

"యస్...నువ్వే. నువ్వు కాకపోతే నీ సుగుణాలు కారణం నీ ఓర్పు+నేర్పు=నా మార్పు."

★



## ఎక్కువ గుండెలున్న ప్రాణులు

జంతు జాతిలో ప్రతి ప్రాణికీ ఒకే గుండె వుంటుంది. కానీ సిడ్, ఒస్టెర్, ఆక్టోపస్ లాంటి ప్రాణులకి మూడు, హాగ్‌ఫిష్‌కి ఐదు, మట్టి పురుగులకి అనేక గుండెలు ఉంటాయిట.

## ఒక చెట్టు విలువ

ఏపుగా ఎదిగిన ఒక చెట్టు కర్రతో 10 లక్షల అగ్గిపుల్లల్ని తయారు చేయవచ్చునట.

-విమలారామం

